పంటల నమోదుతో రైతుకు భరోసా

కౌలు రైతులకూ
పరిహారం అందే అవకాశం

ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టాలను చవి చూస్తున్న రైతులకు ఈ–క్రాప్ నమోదుతో పరిహారం అందుతుంది. ఈ ఖరీఫ్‌లో ఇప్పటికే ఉద్యానవన, వ్యవసాయశాఖల అధికారులు సంయుక్తంగా ఈ– క్రాప్ నమోదు ప్రక్రియ చేపట్టారు. పంటల సాగు వివరాలు నమోదు చేసి నష్టపోతే ప్రభుత్వం సాయం అందించడానికి ఈ ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో సాధారణ రైతులతోపాటు, కౌలు రైతులు ప్రయోజనం పొందేందుకు వీలుంటుంది.

ఈ క్రాప్ నమోదు వివరాలు

మండలం పేరు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈ–క్రాప్ నమోదుచేసిన విస్తీర్ణం (ఎకరాల్లో)
గుర్రంకొండ	6938	4851
పీలేరు	13584	9506
వాల్మీకిపురం	9254	6457
కలికిరి	10120	7084
కేవీ.పల్లె	10650	4260
కలకడ	5486	3843
మొత్తం	56032	36001


నగరిలో ఈ–క్రాప్ నమోదు చేస్తున్న అధికారులు

గుర్రంకొండ : నియోజకవర్గ పరిధిలోని కలికిరి, కలకడ, గుర్రంకొండ, కేవీపల్లె, పీలేరు, వాల్మీకిపురం మండలాల్లో రైతులు వేరుశెనగ, టమాటా, కంది, పెసర, సజ్జ,అలసంద, వరి,పూలు, కూరగాయల పంటలు సాగు చేశారు. ఈ ఆరు మండలాల పరిధిలో ఈ– క్రాప్ నమోదు ప్రక్రియ ఇప్పటికే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం విస్తీర్ణం 56032 ఎకరాలు కాగా, ఇప్పటి వరకూ 36,001 ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న వారికి.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపోయిన వారికి నష్ట పరిహారం అందుతుంది. ప్రభుత్వమే పూర్తిస్థాయిలో రైతుల తరపున బీమా సొమ్ము చెల్లిస్తోంది. దీంతో పంట నష్టపోయినప్పుడు రైతు ఎంత మేర పంట సాగు చేశాడో వివరాలు తెలుస్తాయి. వాటి ఆధారంగా ఉత్పత్తుల లభ్యతపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. ఎరువులు, పురుగుల మందులు, ఎంత మేరకు అవసరం అవుతాయోనని ఆర్‌బీకేలకు తెలిసే అవకాశం ఉంది.

బ్యాంకుల్లో పంట రుణాలు

ఈ క్రాప్ నమోదు ప్రక్రియ ముగిసిన అనంతరం వ్యవసాయాధికారులు జారీ చేసిన ఈ క్రాప్ సర్టిఫికెట్ ద్వారా రైతులు బ్యాంకులో పంట రుణాలు పొందే అవకాశముంది. ఇప్పటి వరకూ పంట రుణాలు పొందని రైతులంతా.. వ్యవసాయాధికారులు జారి చేసే ఈ క్రాప్ సర్టిఫికెట్లతో బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చు. దీంతో పాటు సాధారణ రైతులతోపాటు కౌలు రైతులకు నష్టపరిహారం అందుతుంది. ప్రస్తుతం ఒకసారి కౌలు రైతు గుర్తింపు కార్డు జారీచేస్తే ఈ క్రాప్ నమోదులో కౌలు రైతుల వివరాలు తెలుస్తాయి.

ఎంతో మేలు జరుగుతోంది



ఈ క్రాప్ నమోదుతో మాకు మేలు జరుగుతోంది. ఆర్బీకే సిబ్బంది మా పొలాల వద్దకే వచ్చారు. బీమా సొమ్ము చెల్లించకపోయినా ప్రభుత్వం బీమా సొమ్ము చెల్లించడం ఆనందంగా ఉంది. పంట నష్టపోతే ఎవరి చుట్టూ తిరగకుండా అధికారులు పరిహారం అందజేస్తారు. – గోపాల్, సుంకరవాండ్లపల్లె

కౌలు రైతులకు న్యాయం



గతంలో ఎన్నడూ లేని విధంగా కౌలు రైతులకు ఈక్రాప్ ద్వారా న్యాయం జరిగింది. తాము సాగుచేసిన పంటను పరిశీలించి నమోదు చేస్తున్నారు. తద్వారా అర్హులైన కౌలు రైతులందరికీ న్యాయం జరుగుతోంది. పంట నష్టం సంభవిస్తే నేరుగా కౌలు రైతులకే పరిహారం అందజేస్తున్నారు.
– నరేంద్ర, కౌలురైతు, దౌలత్‌ఖాన్‌పల్లె

క్లుప్తంగా

ప్రణాళిక తయారీపై అవగాహన

పెద్దతిప్పసముద్రం : మండల ప్రణాళిక తయారీపై స్పెషలాఫీసర్ మునిరాజ్ కుమార్, ఎంపీడీవో కేఎస్.బాలాజీ అధికారులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ రంగాల్లో ఉత్పత్తుల పెరుగుదలతోపాటు సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, జీడీపీ పెరుగుదలకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రేమలత, ఈవోఆర్డీ యోగానంద్, ఏఎస్‌వో అశ్వినితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రణాళికతోనే అభివృద్ధి


మాట్లాడుతూ ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి

కలకడ : ప్రతి ఏడాది 15 శాతం వృద్ధి జరిగేలా ఐదేళ్లకోసారి విజన్‌తో కూడిన ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికసిత్ స్వర్ణాంధ్ర-2047 విజన్‌తో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యుఓపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా రాజశేఖర్



వాల్మీకిపురం : వాల్మీకిపురం మండల ట్రాన్స్‌కో ఏఈగా రాజశేఖర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. చౌడేపల్లిలో ఏఈగా పనిచేస్తున్న రాజశేఖర్ బదిలీపై వాల్మీకిపురానికి వచ్చారు. ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జాకీర్ తిరిగి సబ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టారు. రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలోని రైతులు, ప్రజల నుంచి వచ్చే సమస్యలను తక్షణం పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు.

వరద బాధితులకు చేయూత


డీడీ అందజేస్తున్న కరాటే క్లబ్ సభ్యులు

మదనపల్లె సిటీ : విజయవాడ వరద బాధితులకు మదనపల్లె యూత్ కరాటే క్లబ్ విద్యార్థులు చేయూతనిచ్చారు. తమ పాకెట్ మనీగా దాచుకున్న రూ.22,500ను డీడీ రూపంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు గురువారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడానికి చిన్నారులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఆర్.సురేష్, మహేశ్వర్, మహమ్మద్, రెహమాన్, కాలేషా, మమహ్మద్ ఉమర్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పిచ్చి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి సూచించారు. మదనపల్లె మండలం ఒంటిమిట్ట వద్ద గురువారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఇంజినీరింగ్ విద్యార్థులు చెత్తను ఎత్తివేసి శుభ్రం చేశారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అరుణ్‌కుమార్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

తాలూకా ఎస్‌ఐగా చంద్రమోహన్

మదనపల్లె : మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా చంద్రమోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటరమణ పెద్దమండ్యం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన చంద్రమోహన్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

కేవీపల్లె: ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. కేవీపల్లెలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ అమలు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకుని పింఛన్లు పెంచి ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో తహశీల్దార్ క్రాంతికుమార్, రఘురామిరెడ్డి, గాలి సుధాకర్‌నాయుడు, గీతమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీహెచ్‌వో


మాట్లాడుతున్న సీడీపీవో భారతి

పెద్దమండ్యం : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉంటారని సీహెచ్‌ఓ క్రిష్ణయ్య అన్నారు. పెద్దమండ్యం -2 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలలో రక్తహీనత నివారించవచ్చన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లల కోసం తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, నాగేంద్ర, జగన్‌మోహన్, జనార్ధన్ పాల్గొన్నారు.

వాల్మీకిపురం : నిత్యం ఐరన్ ఉండే ఆహారం తీసుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని వాల్మీకిపురం సీడీపీఓ భారతి అన్నారు. మండలంలోని చింతపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ అరుంధతి, రోహిణి కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే భూకబ్జా


విలేకరులతో మాట్లాడుతున్న టి.ఎల్.వెంకటేష్

కేవీపల్లె : రెవెన్యూ శాఖలో అవినీతి అధికారుల నిర్లక్ష్యంతోనే యథేచ్ఛగా భూకబ్జా జరుగుతోందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్.వెంకటేష్ పేర్కొన్నారు. కేవీపల్లె మండల పర్యటనకు వచ్చిన పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి దళిత నాయకులు భూ కబ్జాలపై ఫిర్యాదు చేశారు. విలేకరులతో టి.ఎల్.వెంకటేష్ మాట్లాడుతూ మండలంలోని గర్నిమిట్ట, తీవగుంటపల్లె, మటంపల్లె తదితర గ్రామాల్లో అగ్ర వర్ణాలకు చెందిన బడాబాబులు ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమించుకున్నా అధికారులు చర్యలు తీసుకోవడం గానీ, సూచిక బోర్డులు ఏర్పాటుచేయడం గానీ చేయలేదన్నారు. అధికారుల హామీతోనే మల్లారపువాండ్లపల్లె వద్ద దళితులు సొంతంగా భూమి చదునుచేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. గత తహశీల్దారు నరసింహులు వల్ల దళితులు ఇబ్బందుల పాలయ్యారని, ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు పునరావాసం కింద పక్కా ఇళ్ల మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముల్లంగి చంద్రయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

మన ఇళ్లు మన గౌరవం కార్యక్రమం


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి

పీలేరురూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'మన ఇళ్లు మన గౌరవం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన ఉదయం 9 గంటలకు కంకర లే అవుట్, ఏపీఐఐసీ -1 లే అవుట్ హౌసింగ్ లబ్ధిదారులతో వేర్వేరుగా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి ఆఖరుకు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేకాధికారిణి ప్రసన్నకుమారి, హౌసింగ్ డీఈ గోపాల్‌నాయక్, దయాకర్‌రెడ్డి, సూరిబాబు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యం మెరుగుపరుచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరన్

మదనపల్లె సిటీ : సమాజ అవసరాలు, పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యం మెరుగుపరుచుకోవాలని జిల్లా సైన్సు అధికారి మార్ల ఓబుళరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీ ఫిజికల్ సైన్సు ఫోరం ఆధ్వర్యంలో ఓరియంటేషన్ కార్యక్రమం గురువారం జరిగింది. ఫిజిక్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎం.భాస్కరన్ మాట్లాడుతూ భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులకు అవసరమైన విషయ పరిజ్ఞానాన్ని అందించడానికి తాము ముందుంటామన్నారు. తరగతి గదిలో ఆధునిక పోకడలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అవసరమైన వనరులను ఉపాధ్యాయులకు అందిస్తుంటామన్నారు. రాష్ట్ర స్థాయిలోనే ఇలాంటి కార్యక్రమం మదనపల్లెలో తొలిసారిగా ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు, డివిజన్ ఇన్‌ఛార్జి అప్రోజ్., రాష్ట్ర రిసోర్సు పర్సన్లు నౌషాద్, వెంకట శివయ్య, శివ ప్రసాద్, అన్వర్ సాదత్, పీఎల్ఎన్.శాస్త్రి, బసినికొండ హెచ్‌ఎం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగించండి


గుర్రంకొండ- సుంకరవాండ్లపల్లె మార్గంలో పెరిగిన ముళ్లకంపలు

గుర్రంకొండ : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల పక్కన ముళ్ల పొదలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. దిగువ అమిలేపల్లె నుంచి చింతలవారిపల్లె వరకు, గుర్రంకొండ నుంచి సుంకరవాండ్లపల్లె వరకు ఉన్న రోడ్డు మార్గాలకు ఇరువైపులా ముళ్లపొదల పెరిగిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. రాత్రిళ్లు రోడ్డు మలుపుల దగ్గర ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. లగేజిలతో వచ్చే లారీలు ముళ్లపొదల దగ్గర తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. అధికారుల స్పందించి వెంటనే ముళ్లపొదలు తొలగించాలని వారు కోరుతున్నారు.

ఆటోలను నియంత్రించాలని వినతి


సీఐకి సమస్యలు వివరిస్తున్న రేవతి

బి.కొత్తకోట : ఆర్టీసీ బస్సులకు ఇబ్బందికరంగా మారిన ఆటోలను నియంత్రించి సహకరించాలని మదనపల్లె ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ రేవతి స్థానిక సీఐ రాజారెడ్డిని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐను కలిసి సత్కరించారు. తర్వాత జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బి.కొత్తకోట నుంచి మదనపల్లెకు ప్రతి పది నిమిషాలకు బస్సు నడుపుతున్నామని చెప్పారు. ములకలచెరువుకు 20 నిమిషాలకు ఓ బస్సు ఉందన్నారు. ఈ మార్గాల్లో నిబంధనలకు మించి ఎక్కువమంది ప్యాసింజర్లతో నడుపు తున్నందున డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐ సానుకూలంగా స్పందించి ఆర్టీకి సహకరిస్తామని చెప్పారు. బీవీ.నాయక్, ఈశ్వరప్ప, కుందిలి శంకర్‌రెడ్డి, దామోదర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గాంధీ కూడలిలో స్వచ్ఛతాహీ సేవ


స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఎన్‌హెచ్, జీఆర్ఇన్‌ఫ్రా అధికారులు

కలికిరి : స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా నేషనల్ హైవే, జీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు అధికారులు కలికిరి గాంధీ కూడలిని గురువారం శుభ్రం చేశారు. మహాత్మా గాంధీ విగ్రహానికి నూతనంగా రంగులు వేశారు. గతంలో వాహన ప్రమాదాల్లో విరిగిన వాటి స్థానంలో నూతన దిమ్మెలు ఏర్పాటు చేసి రేడియం స్టిక్కర్లు అంటించారు. గండబోయనపల్లి సమీపంలోని టోల్ గేట్ ప్రాంతంలో స్వచ్ఛ భారత్‌పై కర పత్రాలు వాహనదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే, జీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు అధికారులు బిస్సేగౌడ, రాజేంద్ర కుమార్ గుప్తా, వెంకటేశ్వర్లు, ఏవీ.నాగేంద్రబాబు, ఇందిరా ప్రియదర్శిని, వెంకటభాస్కర్, పట్టాభిరామయ్య, భగవాన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

బి.కొత్తకోట : నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మండలంలోని బడికాయలపల్లెలో గురువారం 'ఇది మంచిప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ చంద్రబాబు అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు దాసిరిపల్లి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల కారిడార్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం బడికాయలపల్లె జెడ్పీ హైస్కూల్, నగర పంచాయతీ కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల డైరెక్టర్ పర్వీన్‌తాజ్, ఎంపీడీఓ శంకరయ్య, ఎంఈవో రెడ్డిశేఖర్, కమిషనర్ పల్లవి, కూటమి నాయకులు కుడుం శ్రీనివాసులు, బంగారు వెంకటరమణ, చింతల కిరణ్, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక శాస్త్రవేత్తలకు సహకారం

సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్


రైతు చిన్నరెడ్డెప్పరెడ్డికి రూ.కోటి చెక్కును అందిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : గ్రామీణ స్థాయిలో ఔత్సాహిక వ్యాపారవేత్తలకు సహకారం అందించేందుకు ప్రారంభించిన జాతీయ లైవ్ స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం) పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ కోరారు. స్థానిక సబ్ కలెక్టరేట్‌లో ఎన్‌ఎల్‌ఎం పథకం కింద లబ్ధిపొందిన రామసముద్రం మండలం అరికెల పంచాయతీ గోసువారిపల్లెకు చెందిన రైతు చిన్నరెడ్డెప్పరెడ్డికి గురువారం కోటి రూపాయల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ పశుగణాభివృద్ధి, ఎన్‌ఎల్‌ఎం పథకం కింద రైతులు ఆవులు, గొర్రెలు, పొట్టేళ్ల పెంపకం ప్రాజెక్టు ప్రారంభిస్తే...కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాయితీ(రూ.50 లక్షలు) ఇస్తుందన్నారు. ఎక్కువ పెట్టుబడి పెట్టలేని రైతులు వారి స్తోమతను బట్టి ప్రాజెక్టు ప్రారంభిస్తే, పెట్టుబడికి 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. దరఖాస్తు ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలో చేయాల్సి ఉంటుందన్నారు. మొదట చిన్నరెడ్డెప్పరెడ్డి రూ.16 లక్షలు పెట్టుబడి పెట్టి, మిగిలిన 34 లక్షల రుణం పొందారని, నిబంధనల ప్రకారం ప్రాజెక్టుకు రూ.50లక్షలు పెట్టుబడి పెట్టడంతో, ప్రభుత్వ రాయితీ కలిపి కోటి రూపాయల చెక్కు అందజేశామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తుకు అవసరమైన పత్రాలు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక వివరాలతో డాక్టర్.లక్ష్మీనారాయణరెడ్డి (8790997387), రాహుల్‌రెడ్డి(9634506369)లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంకిశెట్టి పల్లె పశు వైద్యులు లారెన్స్ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ముజీబ్ హుస్సేన్

మదనపల్లె : పట్టణంలోని ఎంఎల్ఎల్ ఆస్పత్రి ఎదురుగా ఎన్‌హెచ్–219, సర్వే నెంబర్–291లో హైవే అధికారులు ఆక్రమణగా తేల్చిన 119 చదరపు అడుగుల స్థలంలో నిర్మించిన ఆక్రమిత కట్టడాలను మాజీ మున్సిపల్ చైర్మెన్ ముజీబ్ హుస్సేన్ గురువారం సాయంత్రం స్వచ్ఛందంగా తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ ముజీబ్ హుస్సేన్ మాట్లాడుతూ... పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా ఎవరికివారు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడం, రోడ్డుపై నిర్మాణాలు చేపట్టడంతో వాహన దారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆక్రమణలపై ఫిర్యాదు చేయాలని భావించి, ముందుగా తన ఇంటి నుంచే ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపారు. తాను ఆక్రమణలను తొలగించినట్లుగానే, ఇతరులు తొలగిస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుందన్నారు. గాంధీ రోడ్డులో డోర్‌నెం.16–3362 నుంచి 364 వరకు దాదాపు 910 చదరపు అడుగుల మేర ప్రభుత్వ స్థలంలో కట్టడాలు ఉన్నాయని, వాటిని తొలగించాలని కోరారు. ఎమ్మెల్యే, మున్సిపల్ కౌన్సిల్, అధికారులు ఆక్రమణలపై దృష్టి సారించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

• కమ్మేసిన పొగమంచు



బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌పై గురువారం పొగమంచు కమ్మేసింది. తెల్లవారుజాము, సాయంత్రం వేళలో వాతావరణం పూర్తిగా మారిపోయి మంచు కమ్మేయడంతో విడిది చేసిన సందర్శకులు సేద తీరారు. ప్రకృతి అందాలను వీక్షిస్తూ ఉల్లాసంగా గడిపారు. – బి.కొత్తకోట

గృహ నిర్మాణాల వేగవంతం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం : పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు వాటి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని స్పెషలాఫీసర్ మునిరాజ్ కుమార్, ఎంపీడీవో కేఎస్.బాలాజీ సూచించారు. హౌసింగ్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందితో కలిసి వారు పలు లేఔట్లను తనిఖీ చేశారు. అసంపూర్తి నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని వారు స్పష్టం చేశారు.

ప్రత్యేకాధికారిగా మునిరాజ్ కుమార్

పెద్దతిప్పసముద్రం : మండల ప్రత్యేకాధికారిగా పీఆర్ డీఈ మునిరాజ్ కుమార్ నియమితులైనట్లు ఎంపీడీవో కేఎస్.బాలాజీ పేర్కొన్నారు. ఇక్కడ పని చేస్తున్న విజయమోహన్ బదిలీపై వెళ్లారని వారు తెలిపారు. అనంతరం స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని వారు తనిఖీ చేసి బాలికలకు కనీస సౌకర్యాలు, విద్యా బోధన, మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా అనే విషయాలను ఆరా తీశారు.

ప్రణాళిక తయారీపై అవగాహన

పెద్దతిప్పసముద్రం : మండల ప్రణాళిక తయారీపై స్పెషలాఫీసర్ మునిరాజ్ కుమార్, ఎంపీడీవో కేఎస్.బాలాజీ అధికారులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ రంగాల్లో ఉత్పత్తుల పెరుగుదలతోపాటు సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, జీడీపీ పెరుగుదలకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రేమలత, ఈవోఆర్డీ యోగానంద్, ఏఎస్‌వో అశ్వినితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు సత్కారం


శ్రీధర్ రావును సత్కరిస్తున్న ఉద్యోగులు

బి.కొత్తకోట : బి.కొత్తకోట నుంచి ఓబుళవారి పల్లెకు బదిలీపై వెళ్తున్న తహసీల్దారు శ్రీధర్‌రావును కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. డీటీ అన్సారీ మాట్లాడుతూ ఇక్కడ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రెవెన్యూ పాలనలో నూతన మార్పులు తీసుకు వచ్చారని సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బాలాజీ, సర్వేయర్ శ్రీవాణీ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బి.కొత్తకోట : ఆధ్యాత్మిక, మానవతా విలువలపై బి.కొత్తకోట సత్యసాయి సేవా సంస్థ విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని స్థానిక సేవా సమితి కన్వీనర్ శేఖర్‌బాబు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలైన వారికి పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో బంగారు పతకాలను అందిస్తామన్నారు.

వరద బాధితులకు విద్యార్థుల విరాళం


కలెక్టర్‌కు విరాళాన్ని అందజేస్తున్న విద్యార్థులు

తంబళ్లపల్లె : విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయంగా మోడల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.11,260 విరాళం అందజేశారు. నగదును సీఎం సహాయ నిధికి అందజేయాలని కోరుతూ కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ప్రిన్సిపల్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు అందజేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల పరిశీలన


కూలీలతో మాట్లాడుతున్న కేంద్రం బృందం

ములకలచెరువు : మండలంలోని ములకలచెరువు, సోంపల్లె, దేవులచెరువు పంచాయతీల్లో జాతీయ స్థాయి పరిశీలనా బృందం గురువారం కేంద్ర ప్రభుత్వ పథకాలను పరిశీలించింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం అమలును బృందం అధికారి సుధాకర్‌రెడ్డిని ఉపాధి హామీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. ఆయనతో పాటు ఏఓ గౌష్‌బాషా, ఏపీఓ నారాయణస్వామి పాల్గొన్నారు.